

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## శిక్ష

**"వావ్!** అమ్మా నీ ఇంటిలిజెన్స్‌కి నువ్వు ఎక్కడో ఉండాల్సినదానివి. ఇక్కడిలా ఎలిమెంటరీ స్కూల్ టీచర్‌వైపోయావు" సమత పెద్దగా నవ్వుతూ చెప్పింది.

మధుర మొహం నల్లబడింది. అది గమనించిన రవీంద్ర సర్దిచెప్తున్నట్లుగా చెప్పాడు.

"అమ్మ ఎక్కడో ఉంటే మనకి అందేదా తల్లి?"

ఆ ఆదివారం కుటుంబం అంతా డైనింగ్ టేబుల్ ముందు కూర్చుని భోజనం చేస్తున్నారు. తినడం అయిపోయినా అక్కడే కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

మధుర లేచి గిన్నెల్లోంచి గరిటెలు తీసి, గిన్నెలమీద మూతలు పెట్టి మౌనంగా వంటగదిలోకి వెళ్ళిపోయింది.

"నేనేమన్నానని నాన్నా అమ్మ అంత హర్ట్ అయింది?" సమత విస్మయంగా అడిగింది.

"అమ్మ నాలాగా సెన్సిటివ్" సమర్థ్ చెప్పాడు.

సాయంత్రం అంతా ఇంటి వెనక పెరట్లో నవ్వారు మంచాలమీద కూర్చుని మాట్లాడుకుంటున్నారు.

"అమ్మా రేపు పొద్దున్నే బస్‌కి వెళ్ళాలి. ఫైవ్‌కి లేపుతావా ప్లీజ్" సమత అడిగింది.

"బస్‌కి వద్దులేరా నేను దింపుతాను" రవీంద్ర చెప్పాడు.

"నేనూ రేపే వెళ్తానమ్మా. రేపు సెలవైనా నాన్న రెండుసార్లు ఏం తిరుగుతారు?" సమర్థ్ చెప్పాడు.

"ఏంటో. దేశమంతా అభివృద్ధి చెందుతోంది. చిన్న చిన్న గ్రామాల్లో కూడా ఇంజనీరింగ్ కాలేజెస్ వచ్చాయి. కానీ ఈ ఊరు నా పెళ్ళయి వచ్చినప్పుడు ఎలా ఉందో ఇప్పటికీ అలాగే ఉంది, హైస్కూల్ కూడా లేకుండా. ఏ మాత్రం

అభివృద్ధి లేదు. ఇలా పొరుగూళ్ళో పిల్లల్ని ఉంచి చదివించే స్థోమత ఎంతమందికి ఉంటుంది? చాలామంది బలవంతంగా వ్యవసాయం, ఇతర పనులవైపు వెళ్తున్నారు" మధుర ఆవేదనగా చెప్పింది.

"నేనూ అందుకేగా టెన్త్‌తో మంగళం పాడేసింది" రవీంద్ర నవ్వాడు.

"అమ్మా" సమత మెల్లగా పిలిచింది.

వంటగది కడుగుతున్న మధుర కూతుర్ని చూసి మృదువుగా నవ్వి అడిగింది.

"ఏం నాన్న. దిగులుగా ఉందా రేపు సిటీకి వెళ్తున్నావని?"

"కాదమ్మా. నీకొకటి చెప్పాలి."

మధుర ఫేన్ వేసి తలుపు దగ్గరకి వేసి కూతురితో బయటకి వచ్చింది.

"చెప్పు"

"ఇక్కడకాదు. నా గదిలోకి వెళ్దాం"

కూతురు మంచం మీద కూర్చుని దానిమీద పరిచివున్న బట్టలని మడతలు వేసి సూట్‌కేస్‌లో పెడుతూ అడిగింది.

"చెప్పు"

"అమ్మా. నీకు రాహుల్ గురించి చెప్పాలి" సమత తల్లి ఒడిలో తలపెట్టి పడుకుని చెప్పింది.

"రాహులా?"

"నా క్లాస్‌మేట్ అమ్మ. ఆరునెలల్లో హౌస్మెన్ షిప్ అయిపోతుందిగా. మీకు చెప్పమని వత్తిడి చేస్తున్నాడు."

"ఏం చెప్పమని?" మధురకి ఏదో అర్థమౌతున్నట్లుగా వున్నా అయోమయంగా అడిగింది.

" ఉయ్ లవ్ ఈచదర్ అమ్మ."

"ప్రేమా? మరి మాస్టర్స్ చదవవా?"

"పెళ్ళయ్యాక ఇద్దరం కలిసి చదువుకుంటాం."

"పెళ్ళా? ఇక చదువు సాగుతుందా?"

"నువ్వు చదివావుగా అమ్మా."

"నా చదువూ ఒక చదువే. హుః అయినా ఇంత ముఖ్యమైన విషయం నాన్నకి కూడా చెప్పాలి. ఆయన వెనక మనం ఇలా మాట్లాడుకోకూడదు. రవీ" మధుర పెద్దగా పిలిచింది.

"వద్దమ్మా. ప్లీజ్" సమత బతిమాలుతూండగానే రవీంద్ర వచ్చాడు.

"ఏమిటి?"

"సమత ఎవర్నో ప్రేమించిందిట. విషయాలు కనుక్కో." చెప్పి మధుర వెళ్ళిపోయింది.

"ప్రేమా?" రవీంద్ర నివ్వెరపోయాడు.

"నాన్నా. నాకు చాలా ఎంబార్సింగ్‌గా ఉంది. నెక్స్ట్ సాటర్‌డే వస్తాగా. అప్పుడు వివరంగా చెప్తాను ప్లీజ్." సమత అర్థించింది.

శుక్రవారం సాయంత్రం రవీంద్ర ఎప్పటిలా సిటీకి వెళ్ళి పిల్లలిద్దర్ని కారెక్కించుకుని ఇంటికి వచ్చాడు.

రాత్రి భోజనాలయ్యాక సమత రవీంద్రకి ఒక ఫోటో ఇచ్చి చెప్పింది.

"రాహుల్ నాన్నా. నా క్లాస్ మేట్. సెకండియర్ ఫ్రెండ్స్ అయ్యాం. ఫోర్తియర్‌కి వచ్చేసరికి స్నేహం ప్రేమయింది. వాళ్ళ నాన్న గ్రూప్ ఒన్ ఆఫీసర్. మదర్ డాక్టర్. ఒక తమ్ముడు ఇంజనీరింగ్ ఫస్టియర్."

రవీంద్ర ఫోటో చూసాడు. ఈ తరం యువకుల హెయిర్ స్టైల్‌లో రాహుల్ బాగున్నాడు. కుటుంబ నేపథ్యం కూడా బాగుంది. ఆ ఫోటోని మధురకిచ్చాడు.

మధుర్ అయిష్టంగానే ఆ ఫోటోని చూసింది. ఆమె కళ్ళు పెద్దవయ్యాయి. గొంగళిపురుగుని విదిలించినట్లుగా దాన్ని కింద పడేసి ఉగ్రంగా అడిగింది.

"వీడి నాన్న పేరు గంగాధరా?"

"అవును" ఆమె కోపానికి భయపడ్డ సమత చెప్పింది.

"ఈ పెళ్ళి నాకిష్టంలేదు. వీడినే చేసుకుంటా, ప్రేమించాను అనుకుంటే చేసుకో. కాని వీడెప్పుడూ నా ఇంట్లో అడుగుపెట్టకూడదు. రవీ, ఇది నా ఇల్లేగా? సమతకి చెప్పు. పెళ్ళయ్యాక అది రావచ్చుగాని వీడుగాని, వీడి పేరెంట్స్ గాని రావడానికి వీల్లేదు. వీడికి పుట్టిన పిల్లల్ని కూడా నేను తాకను" చెప్పి మధుర విసురుగా తన గదిలోకి వెళ్ళి తలుపు మూసుకుంది.

ముగ్గురూ నివ్వెరపోయారు. రవీంద్ర కిందపడిన ఫొటోని తీసి ఓసారి చూసాడు. గంగాధర్ అనే పేరు అతనిలోని జ్ఞాపకాలని గుర్తుచేసింది.

"నేనింతదాకా అమ్మ చెప్పినదానికి నో చెప్పలేదు పాపా. సారీ" ఫోటోని సమతకిచ్చి లేచి బయటికి వెళ్ళిపోయాడు.

సమత ఏడుస్తూ తన గదిలోకి పరిగెత్తింది. సమర్ధ్ ఒక్కడే మిగిలిపోయాడు.

మర్నాడు ఉదయం మధుర ఎప్పటిలా నిద్రలేచి తన పనులలో మునిగిపోయింది. ఏడున్నరకల్లా స్కూల్‌కి వెళ్ళిపోయింది. రవీంద్ర బ్రేక్‌ఫాస్ట్ ప్రయత్నాలు ఆరంభిస్తే సహాయానికి సమర్ధ్ వచ్చాడు. సమత గదిలోంచి బయటకి రాలేదు.

"పాపా. బ్రేక్ ఫాస్ట్ రెడీ" రవీంద్ర పిలిచాడు.

సమత ముభావంగా వచ్చి టేబుల్ ముందు కూర్చుంది. రెండు ఇడ్లీలు తినేసి మళ్ళీ గదిలోకి వెళ్ళిపోయింది.

"నాన్నా మనం వంట చేద్దామా?" సమర్ధ్ ఉత్సాహంగా అడిగాడు.

"అలాగే. స్నానాలు చేసి వద్దాం" రవీంద్ర అంగీకరించాడు.

ఒకటిన్నరకి మధుర స్కూల్‌నించి వచ్చింది. మధుర శనివారం స్కూల్‌కి వెళితే సమత వంటచేయడం అలవాటు.

"అమ్మా నేను, నాన్న వంకాయకూర, టొమేటో పప్పు, సాంబార్ చేసాం తెలుసా?" సమర్ధ్ తల్లిని చూడగానే చెప్పాడు.

మధుర ఓసారి సమత గదివైపు చూసింది.

భోజనం చేసేప్పుడు మధుర చెప్పింది.

"అన్నం తిన్నాక ఎవరూ గదుల్లోకి వెళ్ళకండి. మాట్లాడాలి."

భోజనాలయ్యాక మధుర రవీంద్రవైపు ఓసారి చూసి చెప్పింది.

"సమతా, నువ్వెప్పుడూ అంటూంటావు కదా ఇంత తెలివైన నేను ఈ పల్లెటూరులో ఎందుకున్నానని, అమ్మమ్మ వాళ్ళింటికి ఎందుకు వెళ్ళం అని. నీకు సమాధానాలు చెప్తా. విని తర్వాత ఏం చేస్తావో నీ విజ్ఞతకే వదిలేస్తున్నా."

"మా అమ్మా నాన్నలకి అన్నయ్యా, నేను ఇద్దరమే పిల్లలం. ఇద్దరం బాగా చదివేవాళ్ళం. మా అమ్మ వాళ్ళకి సొసైటీ అంటే తగని భయం. అన్నీ సమాజం దృష్టితోనే చూసేవాళ్ళు. దాంతో అన్నయ్య, నేను చాలా జాగ్రత్తగా ఉండేవాళ్ళం. నేను టెన్త్ క్లాస్‌లో స్టేట్ ఫస్ట్ వచ్చాను."

"అవునా అమ్మా. ఎప్పుడూ చెప్పలేదే?" సమర్థ్ కళ్ళు పెద్దవి చేసి అడిగాడు.

మధుర విషాదంగా నవ్వింది.

"మొదటినించి నాకు రెండు కోరికలుండేవి. ఒకటి మెడిసిన్ చదవాలి. రెండోది గ్రూప్స్ రాసి ఐఎఎస్‌కి సెలక్ట్ అవాలి. స్టేట్ ఫస్ట్ వచ్చిన నాకు సహజంగానే మంచి కాలేజ్‌లో ఇంటర్మీడియట్‌కి ఫ్రీ సీట్ ఆఫర్ చేసారు. నేను మొదటినించే కష్టపడి చదవడం ఆరంభించాను"

మధుర ఓ క్షణం ఆగి మళ్ళీ చెప్పడం కొనసాగించింది.

"ఆ దురదృష్టకరమైన రోజు నేను కాలేజ్ నించి ఇంటికి వచ్చేసరికి అమ్మా నాన్న విపరీతమైన ఆగ్రహంతో కనిపించారు. ఎందుకో నాకు అర్థం కాలేదు. అదే అడిగాను. అమ్మ నా చెంపమీద బలంగా కొట్టి ఓ ఇన్‌లాండ్ లెటర్ నా మీదకి విసిరేసి అరిచింది.

"దరిద్రపుదానా. పదిహేనేళ్ళకే ఈ దరిద్రపు బుద్ధులు ఎక్కడినించి వచ్చాయ్ నీకు?"

"నేను నిర్ఘాంతపోయాను. ఆ ఉత్తరం ఏమిటో నాకు అర్థంకాలేదు. ఆ ఉత్తరం విప్పి వుంది. దానిమీద నా పేరు, అడ్రస్ రాసున్నాయి. అది ఒక ప్రేమలేఖ"

మధుర చీరకొంగుతో కళ్ళు తుడుచుకుంది.

"నన్ను ప్రేమించానని, నేనంటే ఇష్టమని, నాకూ అతనంటే ఇష్టమైతే ఆ సాయంత్రం సితార సిన్మాహాల్ దగ్గర కలవమని" గంగాధర్ అనే వెధవ రాసిన లెటర్ అది. నేను వణికిపోయాను. నాకేం తెలీదని ఏడ్చాను.

ఆ గంగాధర్ ఎవరో కూడా నాకు తెలీదు. ఆ ఉత్తరంలో కూడా నా ప్రమేయం ఉన్నట్లు లేకపోవడంతో వాళ్ళు అప్పటికి శాంతించారు. ఇంకోసారి అలాంటి లెటర్స్ వస్తే, చదువు మాన్పిస్తామని ఫలానా వాళ్ళ అమ్మాయి ఎవరితోనో ప్రేమాయాణం నడుపుతోందని నలుగురు అనుకుంటే సహించలేమని ఖచ్చితంగా చెప్పారు.

మర్నాడు నేను కాలేజ్‌కి వెళ్ళగానే నా క్లాస్‌మేట్స్‌ని గంగాధర్ అంటే ఎవరు? అని అడిగితే వాడిని చూపించారు. వెనక బెంచీలో కూర్చుని ఫ్రెండ్స్‌తో కబుర్లు చెప్తున్నాడు. నేను అతని దగ్గరకి వెళ్ళి చేతులు జోడించి చెప్పాను.

"ప్లీజండి అలాంటి లెటర్స్ రాయకండి. మా అమ్మావాళ్ళు తిట్టారు. కాలేజ్ మానిపిస్తామంటున్నారు. నాకు చదువంటే చాలా ఇష్టం. మీ చెల్లెల్ని అనుకోండి."

వాడు వాడి మిత్రబృందం పెద్దగా నవ్వారు. బల్లలమీద చరిచి మరీ నవ్వారు. నేను నా ముందు బెంచ్‌కి వచ్చి కూర్చున్నాను.

అమాయకురాల్ని. వాడు నేను చెప్పినట్లు వింటాడు అనుకున్నా. కాని వినలేదు. నాలుగురోజుల తర్వాత ఇంట్లో అదే సీన్. ఈసారి ఆ ఉత్తరంలో నా ప్రమేయంకూడా ఉంది. 'నువ్వు అలా వేడుకుంటూంటే ఎంత ముద్దుగా ఉన్నావో' అని.

ఈసారి అమ్మవాళ్ళు కన్విన్స్ అవలేదు మర్నాడు నన్ను కాలేజ్‌కి వెళ్ళనివ్వలేదు. ఏడ్చాను. అన్నం, నీళ్ళు మానేసాను. ఏం చేసినా వాళ్ళు వినలేదు. నా తప్పు లేకుండా నాకు చాలా పెద్ద శిక్ష వేసారు.

మా ప్రిన్స్‌పాల్ ఇంటికి వచ్చి బతిమాలాడు. కానీ ఆ మూర్ఖులు వినలేదు. నన్ను అమ్మమ్మ ఇంటికి పంపేసారు. ఆ లెటర్స్ రాసినవాడితో పారిపోతానేమోనని. ఆ తర్వాత ఆరు నెలలకే మీ నాన్న సంబంధం చూసి పెళ్ళి చేసారు. నా కలలు ఆశలు మొత్తం భస్మమైపోయాయి.

ఈ ఊరికి రైల్వే స్టేషన్ కాని, హైవేకాని లేవు. రోడ్ మీదున్న ఊరుకాదు. బస్ దిగి మైలు లోపలకి నడిస్తే కాని ఊరు రాదు. ఈ కారణంగా అభివృద్ధి లేదు. ఐదో తరగతి దాకానే ఎలిమెంటరీ స్కూల్ ఉంది. రవి పక్క ఊళ్ళో టెన్త్ దాకా చదివి చదువు మానేసి వ్యవసాయం చేస్తున్నాడు.

పెళ్ళయ్యాక రవికి నా కథ మొత్తం చెప్పాను. ఎవరో ఆకతాయి రాసిన ప్రేమలేఖకి మా వాళ్ళు అతిగా స్పందించి నా చదువు మాన్పించడం, నా కలలు నాశనమవడం చెప్పాను. ఆ తర్వాత నేను మాఅమ్మా నాన్నలని చూడలేదు. వాళ్ళ పరువు నిలుపుకున్నారు కదా ఆనందంగా ఉండమన్నాను. అప్పుడప్పుడూ అన్నయ్యే వచ్చి చూసి పోతూండేవాడు.

రవి నన్ను ప్రైవేట్‌గా చదవమని ప్రోత్సహించాడు. ప్రైవేట్‌గా బైపిసి చదవలేను. సి.ఇ.సి చదివాను. తర్వాత బిఏ చదివాను. రవి సివిల్స్ చదవమన్నాడు. కానీ మీ నాయనమ్మ మనవలు కావాలని అడిగింది. మా అమ్మ కన్నా ప్రేమగా చూసుకున్నావిడ కోరిన ఏకైక కోరిక అది. సివిల్స్ ఆశని సమాధి చేసి నిన్ను కన్నాను. తర్వాత ఎమ్ ఏ చదివాను. సమర్థ్ పుట్టాడు. డెలివరీలకి కూడా పుట్టింటికెళ్ళని నాకు చల్లని తల్లి మీ నాయనమ్మ పురుడు పోసింది. మీ వాళ్ళతో ఏం విరోధం అని కూడా అడగలేదు. బహుశా రవి చెప్పి ఉంటాడు. కాలం అలా సాగిపోయింది. రవి వ్యవసాయం చేస్తాడు కాబట్టి ఈ ఊరు దాటి వెళ్ళలేం. దాంతో స్కూల్ టీచర్‌గా చేరాను." మధుర రవి వంక ప్రేమగా చూసి చెప్పింది.

"మా అమ్మా వాళ్ళు పెళ్ళి చేసి శిక్షించినా రవి మంచివాడు. మీరూ మంచివాళ్ళే. మా మాట విని చక్కగా చదువుతున్నారు. కాని డాక్టర్ కాలేదనే బాధ నన్నెప్పుడూ పొడుస్తూనే ఉంటుంది. వాడు ఆ గంగాధర్ గ్రూప్స్ రాసాడు. డాక్టర్ని పెళ్ళి చేసుకున్నాడు. దోషి జీవితంలో చక్కగా సెటిలయ్యాడు. విక్టిమ్ ఎలిమెంటరీ స్కూల్ టీచరై 'అఆ'లు నేర్పిస్తోంది. వాడి కొడుకుని నువ్వు ప్రేమించావు. నా కన్న తల్లి తండ్రుల మొహం చూడడానికే ఇష్టపడని నేను ఆ నాగుపాముని చూస్తానా?

పిల్లలిద్దరూ నిశ్చేష్టులై వింటున్నారు.

"నా ఉద్దేశం స్పష్టంగా చెప్పాను పాపా. నువ్వే నిర్ణయించుకో. అతన్ని చేసుకున్నా సరే. పిజి చేయడం మానకు. యంబిబియస్ ఒక్కటే ఈ రోజుల్లో చాలదు. నేను, నాన్న నీకు ఏ ఎయిమ్స్‌లోనో సీట్ వస్తుందని ఆశపడుతున్నాం" చెప్పి మధుర రవీంద్ర వైపు చూసింది.

సమత మౌనంగా తన గదిలోకి వెళ్ళిపోయింది. ఆదివారం కూడా నిశ్శబ్దంగా గడిచింది.

సోమవారం రవీంద్ర పిల్లలిద్దర్ని సిటీకి తీసుకెళ్ళాడు. స్కూల్‌కి రెడీ అవుతున్న మధురకి డస్ట్ బిన్‌లో ముక్కలుగా చిరిగిన రాహుల్ ఫోటో కనిపించింది.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments